క్లుప్తంగా

'కార్పొరేట్ కళాశాలల్లో చేరొద్దు'



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాల: కార్పోరేట్ కళాశాలల్లో చేరవద్దని, విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ ద్వారా ప్రతిభ పెరుగుతుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి అన్నారు. దేవిశ్రీ గార్డెన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించి తల్లిదండ్రులు, పాఠశాలలకు పేరు తీసుకురావాలన్నారు. తక్కువ మార్కులు వస్తే చింతించవద్దని, జీవితం ముగిసిపోదని, నైపుణ్యం పెంచుకుని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు శ్రీధర్‌రావు, మొటివేషన్ స్పీకర్ రాజేందర్, జిల్లా కార్యదర్శి అక్రమాలిక్, సంజయ్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సాధారణం

జగిత్యాలరూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని జిల్లా వ్యవసాయాధికారి వాణి అన్నారు. శనివారం జిల్లా వ్యవసాయాధికారిగా పనిచేసి బదిలీపై వెళ్లిన పాక సురేశ్‌ను జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, తాము పనిచేస్తున్న చోట రైతుల మన్ననలు పొందితే ఎంతో సంతృప్తి నిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు రాంచందర్, కల్పన, రమేశ్, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న తహసీల్దార్

రాయికల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. మండల క్లబ్ ఆధ్వర్యంలో భీమన్న జాతర సందర్భంగా నిర్వహించిన మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఎస్సై అజయ్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, క్లబ్ కార్యదర్శి కుర్మ సుదర్శన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి గట్టు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సంకల్పయాత్రకు తరలిరావాలి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

జగిత్యాల: బీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ఈనెల 26న జగిత్యాలలో జరుగనున్న దృష్ట్యా విజయవంతం చేసేలా చూడాలన్నారు. కార్యకర్తలు అందరూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రమణి, సదాశివ్, మదన్‌మోహన్, సత్యనారాయణ, రంగుగోపాల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం నియామకం

మెట్‌పల్లిరూరల్: బీసీ సంక్షేమ సంఘం మెట్‌పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శిగా తుమ్మనపల్లి రాజు, కార్యదర్శిగా శంకర్, మెట్‌పల్లి మండల ఉపాధ్యక్షుడిగా శిరీష్ నియామకమయ్యారు. సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల వెంకటేశ్వర్లు శనివారం వారికి నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా నియాకమైన వారికి పలువురు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో శంకర్, శ్రీకాంత్, సదానందం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి కో ఆప్షన్ సభ్యుడి రాజీనామా

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పన్నాల మాధవరెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు.ఈ మేరకు శనివారం రాజీనామా లేఖ విడుదల చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. పార్టీని వీడడం బాధగా ఉందని పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం


జగిత్యాలరూరల్: స్వామివారి కల్యాణం

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలంలోని అంబారిపేట, తాటిపల్లి గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం స్వామివారికి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దంపతులు, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.


కేశాపూర్‌లో మల్లన్న స్వామి కల్యాణం

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేశాపూర్, కొజన్ కొత్తూర్ గ్రామాలలో శనివారం మల్లన్న కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వీరన్న గట్టు నుంచి మల్లన్నను పల్లకిలో ఊరేగింపుగా మల్లికార్జున స్వామి ఆలయానికి తీసుకవచ్చి మల్లన్నతో మాడాలమ్మ, కేతాలమ్మతో కల్యాణం నిర్వహించారు.

రాయికల్‌లోలక్ష్మీనృసింహస్వామి..

రాయికల్: పట్టణంతో పాటు, మండలంలోని మైతాపూర్ గ్రామంలో లక్ష్మీనృసింహస్వామి కల్యాణం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద మంత్రోత్సవాల మధ్య కల్యాణం కమణీయంగా జరిపారు.


మైతాపూర్‌లో నరసింహ స్వామికి...

కథలాపూర్ మండలంలో...

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి, కలిగోట, పోతారం గ్రామాల్లో శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. స్వామివారి కల్యాణాన్ని భక్తులు నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానాలు చేశారు. ఉత్సవాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఎంపీటీసీలు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


తాండ్ర్యాలలో శ్రీ వేంకటేశ్వరస్వామికి..

షుగర్ ఫ్యాక్టరీ సందర్శనకు త్వరలో సిఫార్సుల కమిటీ

మెట్‌పల్లిరూరల్: ముత్యంపేటలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని సందర్శించేందుకు త్వరలో పరిశ్రమ పునరుద్ధరణ సిఫార్సుల కమిటీ బృందం రానున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. నిజామాబాద్ జిల్లా బోధన్ షుగర్ ఫ్యాక్టరీని శనివారం సిపార్సుల కమిటీ సందర్శించింది. అక్కడికి వెళ్లిన కోరుట్ల కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు, సభ్యులు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఇతర సభ్యులను కలిశారు. వచ్చేనెల మొదటివారంలో ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీకి సిఫార్సుల కమిటీ బృందం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లింగం, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, షేక్‌మహ్మద్, రమేశ్, రమణ తదితరులు ఉన్నారు.

ఘనంగా సంగెం రామస్వామి జాతర

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం శివారులోని గుట్టపై ఉన్న శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.గుమ్లాపూర్ గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి జాతర శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్నదానం చేశారు.అనంతరం రథోత్సవం, పల్లకీ సేవ నిర్వహించారు.


గుమ్లాపూర్‌లో స్వామివారి పల్లకీసేవ


పెగడపల్లి: లింగాపూర్‌లో రథోత్సవం

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి జాతర ఉత్సవాలు

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేట, పాత దాంరాజుపల్లి, గొర్రెపల్లి, కొత్తదాంరాజుపల్లి గ్రామాల్లో శనివారం శ్రీ లక్ష్మీనర్సింహస్వామి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలు

మెట్‌పల్లిరూరల్: పట్టణంలోని బోయవాడ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహోత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో అభిషేకాలు,సత్యనారాయణ స్వామి వ్రతం,స్వామి వారి రథం ఊరేగింపు,తదితర పూజ కార్యక్రమాలు చేపట్టారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్‌లో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిగిన అనంతరం రథోత్సవం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

మల్యాల: మండలంలోని మానాల నల్లగుట్ట శ్రీలక్ష్మీ నర్సింహస్వామి సన్నిధిలో శనివారం రథోత్సవం ఘనంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులు లక్ష్మీ నర్సింహస్వామిని దర్శించుకుని, పూజలు చేశారు.

సాయిబాబా ఆలయంలో పౌర్ణమి వేడుకలు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస సాయిబాబా ఆలయంలో పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

రాయికల్ వార్షిక బడ్జెట్ రూ.15.96 కోట్లు

రాయికల్: మున్సిపల్ వార్షిక బడ్జెట్‌కు శనివారం కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అధ్యక్షతన 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.15.96 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు మాట్లాడుతూ, కౌన్సిలర్లందరి పరస్పర సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ఇటీవల బదిలీపై వచ్చిన కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, మేనేజర్ ప్రకాశ్‌ను కౌన్సిల్ సభ్యులు సన్మానించారు. సమావేశంలో కౌన్సిలర్లు రమాదేవి, మహేందర్, సాయికుమార్, తురగ శ్రీధర్‌రెడ్డి, వల్లకొండ మహేశ్, కాంతారావు, అనురాధ, కో–ఆప్షన్ సభ్యులు మహేందర్, వనిత పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, కౌన్సిలర్లు

వేతనాలు ఇప్పించాలని వినతి

మున్సిపల్‌లో పనిచేసి తొలగించిన 27 మంది కార్మికులకు పెండింగ్‌లో వేతనాలు వెంటనే ఇప్పించాలని కోరుతూ శనివారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను కోరారు. నెల రోజుల్లోపు పెండింగ్ డబ్బులు ఇచ్చేలా కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఘనంగా గురు సంత్ రవిదాస్ జయంతి

కోరుట్ల: పట్టణంలోని మోచి సంఘ భవనంలో సంత్ రవిదాస్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాచర్ల నారాయణ, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షుడు రాయబోస్,తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: సంత్ శిరోమణి గురు రవిదాస్ జయంతి వేడుకలను మెట్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శనివారం మోచీ కులస్తులు రవిదాస్ చిత్రాపటాన్ని ప్రదర్శిస్తూ పట్టణంలో పలు వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమంలో మోచీ సంఘం అధ్యక్షుడు భూమయ్య,సభ్యులు దశరథం, రాజేశ్వర్,రాము పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న నాయకులు

విద్యార్థి దశ నుంచే జ్ఞానం నేర్చుకోవాలి

- డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల/జగిత్యాలరూరల్: విద్యార్థి దశ నుంచే జ్ఞానాన్ని సంపాదించుకోవాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 28న సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిజికల్ సైన్స్‌ఫోరం, బయోలజికల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ టాలెంట్ టెస్ట్‌లో జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వైష్ణవి రెండోస్థానంలో నిలిచింది. ఆమెను డీఈవో అభినందించారు. రాష్ట్రస్థాయికి ఐదుగురిని ఎంపిక చేయగా.. అందులో వైష్ణవి విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు. హెచ్‌ఎం గంగాధర్, ఎఫ్‌పీఎస్‌టీ ఫోరం అధ్యక్షుడు మచ్చ రాజశేఖర్, రాజ్‌గోపాల్, శ్రీనివాస్, చంద్రశేఖర్, కృష్ణలీల పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో

సింగరాయ జాతరలో ప్రభుత్వ విప్


స్వామివారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్

మేడిపల్లి: భీమారం మండలం ఒడ్యాడ్‌లో జరగుతున్న సింగరాయ జాతరలో శనివారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎన్నికల్లో తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించిన గ్రామస్తులకు విప్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరేశ్ రెడ్డి, రమేశ్‌రెడ్డి, గంగాధర్, నక్క శ్రీకాంత్, భట్టు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

పెగడపల్లి: మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పల్స్ పోలియో నిర్వహణపై మండలశాఖ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 0 నుంచి 5 ఏళ్లలోపు ఉన్న వారిని గుర్తించి అందరికీ పోలియో చుక్కలను వేయించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి నరేశ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంపూర్ణ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మల్లాపూర్: గ్రామాల్లో సంపూర్ణ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని పాతదాంరాజుపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్లు నిర్మాణ పనులను శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు.అనంతరం పాతదాంరాజుపల్లి, గొర్రెపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో నిర్వహించిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎల్లాల జలపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, ఫ్యాక్స్ డైరెక్టర్ కొత్తూరి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలి


ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని పాతదాంరాజుపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో శనివారం నిర్వహించిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి జాతర మహోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, బైన ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని 25వ వార్డులోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ నుంచి ఆలయానికి రూ.లక్ష కేటాయించగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

జీవో 317 సవరణకు ఉప సంఘం ఏర్పాటుపై హర్షం

జగిత్యాల: జీవో 317లో జరిగిన లోపాలను సవరిస్తూ మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుపై పీఆర్టీయూ, ఎస్టీయూ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబరు 317 డిసెంబర్ 6, 2021 ప్రకారం కొత్త జిల్లాల ప్రకారం ఉపాధ్యాయుల విభజన జరుగగా, జీవో నంబరు 317తో ఉపాధ్యాయ దంపతులకు, ఉపాధ్యాయులకు స్థానికత ప్రశ్నార్థకమైందన్నారు. లోపాల సవరణకు మంత్రి రాజనరిసింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉపసంఘం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఉపసంఘం ఆధ్వర్యంలో టీచర్లకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జగిత్యాల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్, పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, బోయినపల్లి ఆనందరావు హర్షం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఇబ్రహీంపట్నం : మండలంలోని డబ్బా గ్రామంలో రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఎంపీటీసీ దెొట్టి శాంత భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

మెట్‌పల్లిరూరల్: సంకరజాతి పశువులకు థైలేరియా వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి మనీషా తెలిపారు. మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల,ఆరపేట గ్రామాల్లో పశువులకు శనివారం టీకాలు వేశారు.

పది పరీక్షలకు తొమ్మిది కేంద్రాలు

కోరుట్ల: మార్చి 18 నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పట్టణంతో పాటు మండలంలో 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.తొమ్మిది మంది చీఫ్ సూపరింటెండ్లు, తొమ్మిది మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించినట్టు మండల విద్యాధికారి గంగుల నరేశం తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.

గడికోటలో నో బ్యాగ్ డే

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గడికోట ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్‌డే సందర్భంగా విద్యార్థులు క్రాఫ్ట్ పేపర్స్ వంటి తయారుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంకస్తూరి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడితోటల పరిశీలన

రాయికల్: మండలంలోని కట్కాపూర్, మూటపల్లి గ్రామాల్లోని మామిడితోటలను శనివారం హార్టికల్చర్ ఆఫీసర్ స్పందన పరిశీలించారు. మామిడితోటలలో తేనేమంచు పరుగు, వాటి నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.

ఆర్థిక సాయం అందజేత

పెగడపల్లి: ఊపిరితిత్తుల జబ్బుతో బాధపడుతున్న చిన్నారికి నంచర్ల గ్రామ శ్రీరామ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆర్థికసాయం అందించారు. మండలంలోని రాములపల్లికి చెందిన సుంకె మణెమ్మ–లచ్చయ్య దంపతులకు నెల రోజుల క్రితం కుమారుడు జన్మించాడు. బాబుకు ఊపిరితిత్తుల జబ్బు సోకడంతో ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేయిస్తున్నారు. దీంతో ఆర్థిక స్థోమత లేని పసిబాబు తల్లిదండ్రులు సాయం కోసం శ్రీరామ ట్రస్టును ఆశ్రయించారు. వారి విన్నపం మేరకు ట్రస్టు సభ్యులు దాతల నుంచి రూ. 20289 విరాళాలు సేకరించి శనివారం బాలుడి తల్లి మణెమ్మకు అందించినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్, కోశాధికారి లచ్చయ్య, వైస్ చైర్మెన్ రవీందర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ అంతరాయం

కోరుట్ల: పట్టణంలోని బీమునిదుబ్బ, హాజిపుర, సాయిరామ్‌పుర కాలని, సాయిబాబా మందిరం, మాదాపూర్ కాలని, పోతని భూమయ్య గోదాం వెనుక, వెంకట సాయి నగర్, పాలిటెక్నిక్ కళాశాల ఏరియాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ టౌన్ 1 ఏఈ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం

కథలాపూర్: మండలకేంద్రంలో ఆదివారం మండల ముదిరాజ్ కులసంఘం సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డిష్ నర్సయ్య తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరవుతున్నారని పేర్కొన్నారు.

కాలువలో పూడిక తొలగించిన రైతులు

గొల్లపల్లి: మండలానికి వచ్చే డీ–54 కెనాల్‌లో పూడిక, చెత్తాచెదారం పేరుకుపోవడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందకపోవడంతో రైతులు చెత్తను తొలగించారు. లష్కర్‌తో పాటు, మూకుమ్మడిగా రైతులు చెత్తను తొలగించి కిందకు నీరు వచ్చేలా చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: హైదరాబాద్ బేగంపేట, రామంతపూర్‌లోని పబ్లిక్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి 1వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా శనివారం తెలిపారు. బేగంపేటలో 1, రామాంతపూర్‌లో 1 సీటు కోసం దరఖాస్తులు చేసుకోవాలని, విద్యార్థి 01-06-2017 నుంచి 31-05-2018 మధ్య జన్మించి ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలకు, పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షలకు మించరాదని,ధ్రువీకరణ పత్రాలతో మార్చి 12లోపు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

సారంగాపూర్: విద్యార్థులు తమ పూర్తి సమయాన్ని చదువు కోసం కేటాయించాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి నారాయణ అన్నారు. శనివారం సారంగాపూర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఆందోళన చెందకుండా పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొంక వేణు, బీర్‌పూర్ కళాశాల ప్రిన్సిపాల్ వి. రామకృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోండ్ర రాంచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పోతని నవీన్ కుమార్, పీఆర్‌బీఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పోతని ప్రవీణ్ కుమార్, వివిధ ప్రైవేట్ జూనియర్ కళాశాలల కరస్పాండెంట్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని విజ్‌డమ్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు శనివారం అలరించాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, తహసీల్దార్ ఖయ్యూం, ఎస్సై అజయ్, పాఠశాల కరస్పాండెంట్ ఎద్దండి ముత్యం రాజిరెడ్డి, డైరెక్టర్ నివేదితరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలని ఎమ్మెల్సీ లేఖ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఎల్ఎల్ గార్డెన్ నుంచి గుట్టరాజేశ్వరస్వామి రోడ్డును 60 ఫీట్ల విస్తరణ చేయాలని కలెక్టర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. జగిత్యాల మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా క్రమబద్ధంగా నిర్మాణాలు చేపట్టడంతో పాటు, రోడ్డు విస్తరణ కార్యక్రమం చేపట్టేలా గతంలో మాస్టర్‌ప్లాన్ ఆమోదించిందని పేర్కొన్నారు.

ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి

జగిత్యాల: ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్ అన్నారు. శనివారం సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వాణిశ్రీని సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులందరికీ టీఎన్జీవో సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని, సమష్టిగా పనిచేసి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.